కథా నిలయం

# అమాయకురాలు

శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి



మా ఆయనకి తను చాలా తెలివైనవాడినని గర్వమున్నట్లు పెళ్ళి కాక మునుపే నాకు తెలుసు. ఎందుకంటే పెళ్ళికి మూడు సంవత్సరాలు ముందే మా సంబంధం నిశ్చయమయింది. మే మిద్దరమూ కలిసైతే మాట్లాడుకోలేదు కానీ, వీలున్నప్పుడల్లా యిద్దరం ఒకరి గురించి ఒకరు తెలుసుకోడానికి ప్రయత్నిస్తూండేవాళ్ళం.

ఆయన గర్వం గురించి మొదటి రాత్రే నాకు తెలిసిపోయింది. అయితే ఆ గర్వం నాకు బాధ కలిగించలేదు. పెళ్ళాంచేత ఎలా ఆదరించబడాలో, ప్రేమించబడాలో, పెళ్ళాన్నెలా సుఖపెట్టాలో ఆయనకు తెలుసునట. 'అందుకు కారణం అనుభవమా' అని అడగడానికి నాకు మొదటి రాత్రి అయిన కారణంగా మొహమాటం వేసింది. అదీకాక ఆయన పూర్తిగా పెళ్ళాం సుఖం గురించి ఆలోచించే మనిషి గదా అని ఆనందించాను కూడా. అయితే ఆయన తెలివితేటలు గురించి నాకు మొదటి రాత్రే అనుమానం వచ్చేసింది. ఎందుకంటే? ఆయన నా తొలిరోజు ముగ్ధత్వాన్నీ, సిగ్గునూ బట్టి - నే నమాయకురాలి

నని లెక్క వేశారు. అందువల్ల నాకు కలిగిన నష్టమేం లేదు కాబట్టి పట్టించుకోలేదు.

కాస్త జాగ్రత్తగా ఉంటే భర్త వల్ల చాలా సుఖపడగలనని నేను గ్రహించాను. ఆయన అనుకున్న విధంగా అమాయకంగా మసలుతూ, ఆయన్ను బోల్తా కొట్టిస్తూంటే ఆయనకూ నాకూ కూడా ఇబ్బంది ఉండదనిపించింది.

ఉదాహరణకు భర్తకు తల నొప్పి వచ్చిందనుకోండి. భార్య తల పడితే - ఏమీ బాధ లేదు, అది సహజం. కానీ భార్యకు తల నొప్పి వస్తే - "ఏమండీ, కాస్త తల పట్టరూ?" అంటే, అది భర్త అహాన్ని దెబ్బ తీస్తూంది. అలా కాకుండా భర్త ముందో పదిసార్లు ఉన్నదానికంటె పదిరెట్ల తలనొప్పి అభినయిస్తే — "నేను తల పట్టనా వసూ?" అంటూ ఆయనే ముందుకు వస్తారు. అందుకు లక్ష విధాల అభ్యంతరం చెప్పి గతిలేక అంగీక రించినట్లు నటించాలి. అప్పుడు కూడా - "పాపిష్టి దాన్ని -మీచేత సేవలు చేయించు కుంటున్నాను" అంటూ బాధ పడాలి. అప్పుడు భర్త భార్య అమాయకత్వానికి జాలి పడి, బ్రతిమాలి, ఓదార్చి మరీ సేవ చేస్తాడు. కానీ నోరు విడిచి కాళ్ళు పట్టమన్నా, తల పట్టమన్నా, ఎంత మంచి భర్తయినా మనస్ఫూర్తిగా ఆ పని చేయడు.

ఇవన్నీ పెళ్ళయి కాపురానికి వెళ్ళాక వేయవలసిన ట్రిక్కులు. అయితే నా భర్త పెళ్ళి కాగానే, వేరు కాపురం పెట్టకానే వేసిన ట్రిక్కు- దాని ఫలితం గురించి ఇక్కడ వివరించబోతున్నాను. ఆ ట్రిక్కు అలా ఫలించడానికి కారణం, ఆయన తనకున్నాయను కున్న తెలివి తేటలూ, నాకుందను కునే అమాయకత్వమూ కారణం.

మొదటి రోజున ఆయన ఆఫీసుకు గంట లేటుగా వెళ్ళారు. ఇంటికి అర గంట పెందరాళే వచ్చారు. యూనివర్శిటీలో లెక్చరర్ ఆయన. ఈ రెండూ చేశాక, "డిపార్టుమెంట్లో నేను మకుటం లేని మహారాజును. నే నెప్పుడు వెళ్ళినా, వచ్చినా అడిగేవారు లేరు" అని నాకు చెప్పారు.

రెండో రోజున ఆయన నన్ను తన డిపార్టుమెంటుకు తీసుకు వెళ్ళారు. అక్కడి పరిస్థితి చూసేక ఆయన చెప్పింది నిజమే ననిపించింది. ఆయనెప్పుడొచ్చిందీ, వెళ్ళింది పట్టించుకోడాని కక్కడ ఎవ్వరూ లేరు. అప్పుడప్పుడు

క్లాసులు తీసుకోవాలి. ఆ సమయానికుంటే - అంతే చాలు. అవసరమైతే ఎప్పుడైనా ప్రొఫెసరుతో డిస్కషన్సు చేయాలి. నేను ఆశ్చర్యంగా, అమాయకంగా అక్కడి పరిస్థితులను గమనిస్తూంటే ఆయన కళ్ళు గర్వంగా వెలిగాయి. నాకు తనపట్ల ఆరాధనా భావం కలిగిందని ఆయన నిర్ణయించుకున్నారు.

ఆయన నన్ను తను పనిచేసే లాబొరేటరీకి తీసుకెళ్ళారు. అక్కడ ఆయన రీసెర్చి చేస్తున్నారు. అక్కడ ఉన్న తళతళ మెరుస్తున్న గాజు బీకర్లను చూపించి - "ఇవి కొత్తవి కావు. మా ప్రయోగాల కోసం వీటినిలా శుభ్రపరచాలి. ఇవి నేను కడిగిపెట్టినవి" అన్నారు.

"నిజం!" అన్నాను ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

నా ఆశ్చర్యంలో అనుమానం కనబడినట్లుందాయనకు. అప్పటికప్పుడు అక్కడున్న ఓ బీకర్లోని సొల్యూషన్ పారబోసి తను స్వయంగా సోడియం కార్బనేట్ తో (వాషింగ్ సోడా) దాన్ని శుభ్రం చేశారు. నేను చూస్తూండగా దాన్నక్కడ ఆయన కడిగి పెట్టారు. అది తళతళ మెరుస్తోంది. నేను ఆయన చాతుర్యాన్నభినందించాను. ఆ తర్వాత ఆయన నా సమక్షంలో ఓ ఎక్స్పెరిమెంట్ చేశారు. ఓ సొల్యూషన్ని బున్సెన్ బర్నర్ మీద వేడి చేసి దింపి గాజు కడ్డీతో దాన్ని కలిపి, దాంట్లో ఇంకో సొల్యూషన్ ఏదో పోశారు. తెల్లటి పొడి ఆ సొల్యూషన్లోంచి తేలింది. ఏదో గారడీ చూస్తున్నట్లు చూశాను.

మూడో రోజున ఆయన నన్ను ఊటీ హోటల్‌కు తీసుకువెళ్ళారు. "ఇది పరిశుభ్రతకు మారు పేరు. పదార్థాల రుచి కాదు ముఖ్యం. ఏ వాతావరణంలో తింటున్నామన్నది ప్రధానం. అందుకే నేనెప్పుడూ ఈ హోటలుకే వస్తుంటాను" అన్నారాయన. ఆయన అభిరుచి నభినందిస్తూ ఆ హోటల్‌ను తేరిపార చూశాను. ఇప్పటి సంగతి తెలియదు కానీ, అప్పట్లో ఆ హోటల్ నిజంగానే చాలా శుభ్రంగా వుండేది.

"ఇది బోర్డింగూ, లాడ్జింగూ కూడా కదూ?" అన్నాను.

"అవును. అయినా శుభ్రతకు లోటు రావడం లేదు" అన్నారాయన.

నాలుగో రోజున ఆయన నన్ను ప్రేమగా దగ్గరగా తీసుకుని- "నీకు నేను చూపించిన విశేషాల పరమార్థం తెలుసునా? ఇంట్లో వస్తు

వులు నేను లాబొరేటరీలో చూపించిన గాజు బీకర్లలా తళతళలాడాలి. మన ఇల్లు ఊటీ హోటల్ని మించి ఉండాలి" అన్నారు. ఆయన కళ్ళ వైపు అమాయకంగా చూస్తూ తల ఊపాను.

అయిదో రోజున ఉదయం నేనాయన్ను వంటింట్లోకి పిలిచాను. ఆయన రాగానే "ఏమండీ! నేనెంత తోమినా ఇవి తళ తళలాడడం లేదండీ! కొంత హస్తవాపి అంటారు. చిన్నప్పట్నించీ ఇంతే- నేనెంత తోమినా శుభ్రంగా ఉండేవి కావు. మీ హస్తవాపి లాబొరేటరీలో చూశాను. కొంచెం సాయం చేయరూ?" అన్నాను గోముగా.

ఆయన మారు మాట్లాడకుండా ముందుకు వచ్చారు. కాఫీగ్లాసులు తోమేసరికే ఆయనకు చిరాకు వచ్చింది. "టైము చాలదు వసూ!" అన్నారు- అదే కారణమైనట్లు.

"మీకు టైమేమిటండీ? ఎప్పుడు వెళ్ళినా అడిగేవారు లేరు" అన్నాను.

కాదనడానికి ఆయనకు అహం అడ్డు వచ్చింది. మొత్తం గిన్నెలన్నీ తళ తళలాడేలా తోమారు.

నేను పచ్చడి రుబ్బుతుండగా అన్నం వార్చుకొస్తే ఆయన్ను చూడమన్నాను. "నాకు తెలియదు వసూ!" అన్నారాయన.

"అదేంటండీ? లాబొరేటరీలో మీ ఎక్స్పరిమెంటు చూశాను. అదీ వంటలాగే ఉంది. నిజంగా మీ లాంటి భర్త దొరకడం నా అదృష్టం. మీ పనులు చేసుకోవడమే కాక నాపనుల్లో సాయం కూడా చేస్తున్నారు" అంటూ అన్నం వార్చడం ఏలాగో చెప్పాను. ఆయన వెళ్ళి అన్నం వార్చారు. నేను తర్వాత చూసి - "నిజం చెప్పండి- అన్నం వార్చడం మీకిది మొదటిసారి కాదు కదూ?" అన్నాను.

"నీమీద ఒట్టుగా ఇదే మొదటిసారి" అన్నారాయన.

"నే నెప్పుడు వార్చినా ఇంత విడి విడి లాడుతూ వచ్చేదికాదు. ఎలాగైనా హస్తవాపి" అన్నాను. ఆయన ముఖం చేటంతయింది.

ఆయన ఆఫీసుకు వెళ్ళేటప్పుడు "ఈవేళ షష్టిషోకి వెడదాం- పెందరాళే వచ్చేస్తారు కదూ?" అన్నాను. ఏదో అనబోయి ఆగిపోయారాయన. డిపార్టు మెంట్లో ఎప్పుడు వెళ్ళినా, వచ్చినా తన నడిగేవారు లేరని ఎప్పుడో చెప్పారాయన.

సాయంత్రం ఆయన ఇంటికి వచ్చేసరికి- నా అలంకరణ పూర్త

యింది. నన్ను చూస్తూనే దగ్గరగా తీసుకుని-"చాలా బాగా అలంక రించుకున్నావు. నిన్ను చూస్తుంటే-" అని ఏదో అనబోయి ఇంటి పరిస్థితి చూసి ఆగిపోయారు. ఇల్లు సర్దలేదు నేను.

"ఛీ-ఇల్లంతా అపరిశుభ్రంగా ఉంది. ఇలాంటప్పుడు, ఇలాంటి చోట టిఫన్ ఎలా తినేది?" అన్నా రాయన కొద్దిగా చిరాకును ప్రద ర్శిస్తూ.

"మధ్యాహ్నం అనుకోకుండా నిద్ర పట్టేసిందండీ- లేవగానే సినిమా ప్రయాణం సంగతి గుర్తొ చ్చింది. టాయ్‌లెట్ అవ్వాలికదా? అది కాస్త టైం పట్టింది. పరిశుభ్ర వాతావరణంలో కానీ టిఫిన్ తిన లేరుగా అని, టిఫిన్ చేయలేదు. ఊటీ హోటల్లో టిఫిన్ తిని సిని మాకు పోదాం" అన్నాను భయాన్ని నటిస్తూ.

నా భయం చూసి ఆయనకు జాలివేసింది. ప్రేమగా ఓదార్చారు. తర్వాత వెళ్ళి ఊటీ హోటల్లో టిఫిన్ తిని, సినిమా చూసి వచ్చాం. రాత్రి ఆయనతో—"మిమ్మల్ని నేనేమైనా ఇబ్బంది పెడితే చెప్పండి. ఎవరిదగ్గర ఎలా మసలుకోవాలో నాకు తెలియదు. అన్నింటికీ మీరే నా గురువు. మీ రేమన్నా నేనేమీ అనుకోను" అన్నాను.

ఆయన మహదానంద పడి పోయి భార్య భర్తకు అలా భయ పడకూడదనీ, సంసారంలో భార్యా భర్తలిద్దరూ సమానులనీ కొన్ని విశేషాలు చెప్పారు.

"ఏమోనండీ! నాకు మాత్రం అలా అనిపించదు. కష్టపడి సంపా దించేది మీరు-కూర్చుని తినేదాన్ని నేను" అన్నాను.

ఆయనకు ఆనందమూ, నామీద అభిమానమూ, నా అమాయకత్వం మీద నమ్మకమూ అన్నీ ఒక్క సారిగా పెరిగాయి.

మా జీవితం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వెళ్ళిపోతోంది.

ఓ సారి మా ఇంటికి నాస్నేహి తురాలు తనభర్తతో కలిసివచ్చింది. మాటల సందర్భంలో ఆయన తన భార్య బొత్తిగా అమాయకురాలని చెప్పాడు.

"మా ఆవిడా అంతే!" అన్నారు నా భర్త.

నాకు నవ్వు వచ్చింది. స్నేహి తురాలిని వంట గదిలోకి తీసుకు వెళ్ళి "మీ ఆయన నిన్నమాయకు రాలని అన్నాడు. అంటే తప్పక నీకు గిన్నెలు కడిగిపెడుతూ ఉంటాడు. అవునా?" అన్నాను.

స్నేహితురాలు నవ్వి-"అను భవంమీద చెబుతున్న నీ మాటలు నేనెలా కాదనగలను?" అంది. *